

స్టాక్ నిల్వలను నమోదు చేయాలి

మాడ్గుల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఎరువుల స్టాక్ నిల్వలను ఎప్పటికప్పుడు ఈ పాస్‌లో నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉష డీలర్లను ఆదేశించారు. మాడ్గుల మండలంలోని అప్పారెడ్డిపల్లి, మాడ్గుల, ఇర్విన్ గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణాలను మండల వ్యవసాయ అధికారి అరుణకుమారితో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. నకిలీ మందులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు రశీదు ఇవ్వాలని సూచించారు. వారివెంట వ్యవసాయ అధికారి అరుణకుమారి, అధికారులు ప్రియాంక, రాజేష్, డీలర్లు మర్రెడ్డి, మహేష్, శివశంకర్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ సందర్శనకు విద్యార్థులు, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు భారీగా తరలి వచ్చారు. ఇక్కడ ఏర్పాట్లు చూసి వారు ఆశ్చర్యపడ్డారు. నిన్న మొన్నటి వరకు రాళ్లు రప్పలతో ఉన్న ప్రాంతం ఒక్కసారిగా అంతర్జాతీయ వేదికగా రూపుదిద్దుకోవడం చూసి ఆశ్చర్యపోయారు. అలాగే ఇక్కడ ఏర్పాట్లు చూసి అబ్బురపడ్డారు.


సమ్మిట్ ప్రాంగణంలో సందర్శకులు

సెమినార్‌కు హాజరైన దగ్గుబాటి రాణా

అబ్బురం.. ఆశ్చర్యం

సమ్మిట్‌లో సందర్శకుల సందడి

- సాధారణ ప్రజలకు అనుమతి
- 4,500మంది హాజరు
- అధిక సంఖ్యలో విద్యార్థుల రాక
- సందర్శకులను ఆకట్టుకున్న రోబోలు
- సమ్మిట్ ప్రాంతానికి వచ్చేందుకు ఆర్టీసీ ఉచిత బస్సు సౌకర్యం
- తాగునీరు, భోజన వసతులు
- ప్రత్యేక ఆకర్షణగా బోనాల ప్రదర్శన
- సినీహీరో దగ్గుబాటి రాణా రాకతో కేరింతలు
- భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన రాచకొండ సీపీ



రంగారెడ్డి అర్బన్/ఇబ్రహీంపట్నం/కందుకూరు/మహేశ్వరం, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట-బేగరికంచలో ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాటు చేసిన విషయం విదితమే. ఈ సమ్మిట్‌కు దేశ, విదేశాల నుంచి పలు రంగాల్లో నిష్ణాతులను ఆహ్వానించింది. 6 ఖండాలు, 44 దేశాలు, దేశంలోని పలుప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రతినిధులతో ఈ ప్రాంగణం రెండు రోజుల పాటు సందడి నెలకొంది. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో, సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటుచేసిన సమ్మిట్ ప్రాంగణాన్ని సాధారణ ప్రజలు సందర్శించేందుకు ప్రభుత్వం

మిగతా 6వ పేజీలో...


సెమినార్ హాల్‌లో విద్యార్థుల నృత్యం


ఫ్యూచర్ సిటీ నమూనాను తిలకిస్తున్న విద్యార్థులు

చలి పంజా

రికార్డు స్థాయిలో పడిపోయిన ఉష్ణోగ్రతలు

కురుస్తున్న పొగమంచు • సాయంత్రం నుంచే చలిగాలులు

• బయటకు రావాలంటేనే జంకుతున్న జనం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో చలి పంజా విసురుతోంది. పలు ప్రాంతాల్లో కనివినీ ఎరుగని రీతిలో ఉష్ణోగ్రతలు పడిపోయాయి. రంగారెడ్డి జిల్లా మెయినాబాద్ మండలం రెడ్డిపల్లిలో 6.6 డిగ్రీల

మిగతా 7వ పేజీలో...

ఉమ్మడి జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు

జిల్లా	ప్రాంతం	కనిష్ట(డిగ్రీలు)
రంగారెడ్డి	రెడ్డిపల్లి	6.6
వికారాబాద్	మోమిన్‌పేట	6.9
మేడ్చల్	ఉప్పల్	9.4



ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి : కలెక్టర్

(ఆంధ్రజ్యోతి,రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్నిఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులకు ఆదేశించారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలన్నారు. మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లను బుధవారం కలెక్టర్ పరిశీలించారు. శంషాబాద్ జిల్లా పరిషత్ (బాలుర) ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించి పోలింగ్ అధికారులకు ఇచ్చిన ఎలక్షన్ మెటీరియల్ పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సామగ్రిని పోలింగ్ కేంద్రం వారీగా వేరుచేసి సకాలంలో చేర్చాలన్నారు. పోలింగ్ మెటీరియల్ పంపిణీ ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. మైక్రో అబ్జర్వర్లతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఎన్నికల సామగ్రిని, బ్యాలెట్ పేపర్లను, పోలింగ్ బాక్సులను పరిశీలించారు. బ్యాలెట్ పత్రాలు జాగ్రత్తగా చెక్‌చేసి ప్యాక్ చేయాలని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ కేంద్రం చేరుకొని ఓటింగ్ నిర్వహణ ఏర్పాట్లను మరోసారి నిర్ధారణ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఆర్డీవో



వెంకట్ రెడ్డి, శంషాబాద్ తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో మున్ని, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో రాజేంద్రనగర్‌లోని ఈవీఎం గోదామును కలెక్టర్ పరిశీలించారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా ఇక్కడ భద్రపరిచిన బ్యాలెట్ యూనిట్‌లు, ఎన్నికల సామగ్రి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల వివరాల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈవీఎంలు, బ్యాలెట్ యంత్రాల విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ గోదాం సీల్‌ను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తెరిచి అనంతరం వారి సమక్షంలో సీల్ వేయించారు. ఆర్డీఓ వెంకట్ రెడ్డి, తహసీల్దార్, వేర్ హౌస్ ఇన్‌చార్జి బొమ్మ రాములు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

శంకర్‌పల్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గోవిందరావు అన్నారు. చందిప్పలోని మరకత శివాలయాన్ని బుధవారం ఆయన, తన భార్యతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ వారు ఆయనను శేషవస్త్రంతో సత్కరించి స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రచార కమిటీ చైర్మన్ దయాకర్‌రాజు, చైర్మన్ గోపాల్‌రెడ్డి, అన్నదాన కమిటీ చైర్మన్ దర్శన్‌గౌడ్, అర్చకులు సాయిశివ తదితరులు ఉన్నారు.


గోవిందరావుకు చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి

ఖరీదైన 'పంచాయతీ' ఎన్నికలు

- శివార్లలో రూ. కోట్లు వెదజల్లుతున్న వైనం
- ఏరులై పారుతున్న డబ్బు, మద్యం ● ఓటుకు రూ.10వేలు!
- ఇంటింటికీ ఖరీదైన మద్యం బాటిళ్లు సరఫరా



(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి) : తొలి విడత ఎన్నికలు జరిగే పంచాయతీల్లో డబ్బు, మద్యం ఏరులై పారుతోంది. ఎన్నికల్లో పోటీ చేసే సర్పంచ్, వార్డు అభ్యర్థులు ఓట్లను ఆకర్షించేందుకు భారీగా డబ్బు వెదజల్లుతున్నారు. ఇప్పటి వరకు మందు, విందుల కోసం భారీగా ఖర్చుచేసిన అభ్యర్థులు ఓట్లు కొనుగోలుకు రూ. కోట్లలో ఖర్చుచేస్తున్నారు. అనేక గ్రామాల్లో రూ. కోటి నుంచి రూ. 3కోట్ల వరకు సర్పంచ్ అభ్యర్థులు ఎన్నికల్లో ఖర్చుపెడుతున్నారు. బుధవారం రాత్రి అనేక గ్రామాల్లో అభ్యర్థులు పోటాపోటీగా డబ్బు పంపిణీ చేశారు. ఇంటింటికీ తిరిగి తాయిలాలు ఇవ్వడమే కాక ఓటుకు రూ.5వేల నుంచి రూ. 10వేల వరకు పంచుతున్నారు. అభ్యర్థులు డబ్బులు పంపిణీకి ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేసుకున్నారు. చిన్న గ్రామ పంచాయతీల్లో పోటీ తీవ్రంగా కనిపిస్తోంది. దీంతో ఇక్కడ డబ్బు ప్రవాహం అధికంగా ఉంది. అలాగే జనరల్ స్థానాల్లో అభ్యర్థులు డబ్బు మంచినీళ్ల ప్రాయంగా ఖర్చుచేస్తున్నారు. ఓటర్లను ఆకట్టుకునేందుకు ఇంటింటికీ డబ్బు పంపిణీతో పాటు ఖరీదైన మద్యం, మాంసం సరఫరా చేస్తున్నారు. మహిళలకు చీరలతో పాటు ఇతర వస్తువులు పంపిణీ చేస్తున్నారు. హైదరాబాద్ చుట్టు పక్కల గ్రామాలకు చెందిన వారు నగరంలోని ఓటర్లకు భారీ తాయిలాలు ఇచ్చి రప్పించుకుంటున్నారు. ఓటర్లకు రవాణా సౌకర్యం ఏర్పాటు చేయడమే కాకుండా దారి ఖర్చులకు అదనంగా డబ్బులు ఇస్తున్నారు. వీరిని రప్పించేందుకు కార్లు కూడా ఏర్పాటు చేస్తున్నారు. తొలివిడత ఎన్నికలు జరిగే షాద్‌నగర్ నియోజవర్గంలోని బండోనిగూడ, నంది గామ, బుక్కోనిగూడలో పోటీ తీవ్రంగా ఉండడంతో ఓటుకు రూ.10వేల వరకు పంపిణీ చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇక్కడ ఓటర్లు తక్కువగా ఉండడంతో అభ్యర్థులు ఓట్లు కొనుగోలుకు వెనుకాడడం లేదు. పోటీపడి ఇక్కడ ఓటు ధర పెంచేశారు. అలాగే శంషాబాద్ మండలం పాల్మాకుల్, పెద్ద షాపూర్, నర్కూడల్ కూడా ఓటుకు రూ.5 నుంచి రూ.7వేల వరకు పంచుతున్నారు. అలాగే నగర శివార్లలోని ఇబ్రహీంపట్నం సమీపంలోని ఓ మద్యం వ్యాపారి ఇంటింటికీ ఖరీదైన మద్యం పంపిణీ చేస్తున్నాడు. రోజుకో ఫుల్‌బాటిల్ ఇంటింటికీ ఇస్తున్నాడు. ఇంతేకాక ఓటుకు రూ.5వేల చొప్పున పంపిణీ చేస్తున్నాడు. ఇలా నగర శివార్లలో అనేకమంది సర్పంచ్ అభ్యర్థులు భారీగా ఎన్నికల్లో డబ్బు ఖర్చుచేస్తున్నారు. ఇక వార్డులకు పోటీ చేస్తున్న వారు కూడా విచ్చలవిడిగా డబ్బు ఖర్చుపెడుతున్నారు. అభ్యర్థులు ఖర్చు చేయలేని పరిస్థితి ఉంటే వారికి మద్దతు ఇచ్చే నేతలు తలో ఇంత వేసుకుని ఓట్లు కొనుగోలు చేస్తున్నారు.

నేడే తొలి పోరు

తొలి విడత సర్పంచ్ ఎన్నికలకు సర్వం సిద్ధం

జిల్లాలో తొలి విడత పల్లె పోరుకు ఎన్నికల అధికారులు సర్వం సిద్ధం చేశారు. షాద్‌నగర్, శంషాబాద్ పరిధిలో ఏడు మండలాల్లో గురువారం పోలింగ్ జరుగనుంది. ఇప్పటికే ఎన్నికల సిబ్బంది పోలింగ్ సామగ్రితో వాహనాల్లో గ్రామాలకు బయలుదేరి వెళ్లారు. ఉదయం 7గంటలకు ఓటింగ్ ప్రారంభం కానుంది. మధ్యాహ్నం కౌంటింగ్ మొదలు పెట్టి రాత్రి వరకు ఫలితాలు వెల్లడించనున్నారు. అయితే పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. షాద్‌నగర్ నియోజకవర్గం పరిధితో పాటు శంషాబాద్ మండలంలో 174 గ్రామ పంచాయతీల్లో ఎలక్షన్స్ జరగనున్నాయి.




కొత్తూర్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద పోలింగ్ సిబ్బంది

షాద్‌నగర్/శంషాబాద్/ కొత్తూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్, శంషాబాద్ పరిధిలో ఏడు మండలాల్లో గురువారం తొలి విడత ఎన్నికలు జరుగనున్నాయి. బుధవారం ఎన్నికల నిర్వహణ సామగ్రిని ఆయా ఎంపీడీవో కార్యాలయాల్లో పోలింగ్ సిబ్బందికి అందజేశారు. గురువారం ఉదయం(నేడు) 7గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ జరగనుంది. అనంతరం 2గంటల నుంచి పోలైన ఓట్ల లెక్కింపు మొదలు పెట్టి రాత్రి వరకు ఫలితాలు

మిగతా 8వ పేజీలో...

- ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్
- మధ్యాహ్నం 2 గంటలకు కౌంటింగ్, రాత్రి వరకు ఫలితాలు
- షాద్‌నగర్, శంషాబాద్ పరిధిలో 174 గ్రామపంచాయతీలు
- ఆరుగురు ఏకగ్రీవం.. 168 సర్పంచ్ స్థానాల్లో 530 మంది అభ్యర్థులు
- 1530 వార్డులకు 190 వార్డులు ఏకగ్రీవం..
- 1340 వార్డు స్థానాల్లో 3,379 మంది అభ్యర్థులు బరిలో


పోలింగ్ కేంద్రాలకు తరలుతున్న ఎన్నికల సిబ్బంది

60 మంది సిబ్బందిపై వేటు?

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్య ఫలితం

మరో 80 మందికి షోకాజ్ నోటీసులు!

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): పంచాయతీ ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించిన దాదాపు 60 మంది సిబ్బందిపై సస్పెన్షన్ వేటుకు రంగం సిద్ధమైంది. అలాగే మరో 80 మందికి షోకాజ్ నోటీసులు సిద్ధమయ్యాయి. వీరందరిపై కలెక్టర్ నారాయణరెడ్డి చర్యలకు ఆదేశించినట్లు సమాచారం. బుధవారం అర్ధరాత్రి ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందని అధికారవర్గాలు తెలిపాయి. గతంలో కూడా పంచాయతీ ఎన్నికల విధుల్లో నిర్వహించడంలో నిర్లక్ష్యం వహించిన దాదాపు 300 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఇటీవల నిర్వహించిన శిక్షణా కార్యక్రమాలకు కొందరు గైర్హాజరయ్యారు. వీరందరికీ ఇప్పటికే షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించిన సిబ్బంది సంఖ్య పెద్దగా ఉండడంతో అధికారులు తీవ్ర చర్యలకు దిగినట్లు సమాచారం. వీరే కాక మరికొందరిపై కూడా త్వరలో చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలి
● శంషాబాద్ డీసీపీ రాజేశ్
7



పోటీ ప్రతిష్టాత్మకం
● గ్రామాల్లో భారీగా ఎన్నికల హామీలు
● ఓటర్లను ఆకట్టుకుంటున్న అభ్యర్థులు
7

అబ్బురం.. ఆశ్చర్యం

(ఐదో పేజీ తరువాయి)

శనివారం వరకు అనుమతించిన సంగతి తెలిసిందే. సమ్మిట్ ప్రాంగణంలోకి బుధవారం జనం తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్ని ప్రాంతాలను సందర్శించారు. అధికారులు ఎంపికచేసిన విద్యా సంస్థల నుంచి విద్యార్థులను ప్రత్యేక బస్సుల్లో తరలించారు. నగరశివారు లోని పలు ఇంజినీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, తదితర వృత్తి విద్యాకోర్సుల విద్యార్థులు 2,500 మంది పాల్గొన్నారు. మరో 2వేల మంది ప్రజలు ఈ ప్రాంగణాన్ని సందర్శించారు. అలాగే పలువురు వ్యాపారవేత్తలు, చుట్టుపక్కల గ్రామస్తులు వేలాది మంది సందర్శించి, ప్రాంగణంలో ఏర్పాటుచేసిన అధునాతన రోబోలు, త్రిడీ స్క్రీన్లను వీక్షించారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఉద్దేశాలను, ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల వివరాలను ఇక్కడ అధికారుల సందర్శకులకు వివరించారు. ఈ సందర్భంగా సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన ఏఐ రోబోలు, టచ్ కియోస్కులు, డిజిటల్ బన్నెల్, త్రీడీ తెరలు చూసి మంత్రముగ్ధులయ్యారు. స్టాళ్లు, హాళ్లను చూసి సందర్శకులు తన్మయత్వం చెందారు. తెలంగాణ రైజింగ్ థీమ్‌తో ఫ్యూచర్ సిటీతో పాటు



హైదరాబాద్‌లో యువత ఉపాధి అవకాశాలపై ప్రముఖులతో ప్రధాన హాల్లో సెమినార్లు నిర్వహించారు. విద్యార్థులకు స్టార్టప్‌లు, వ్యవసాయ పరంగా సాంకేతిక అభివృద్ధి, ఏఐ, అంశాలపై అవగాహన కల్పించారు.

సినీ హీరో దగ్గుబాటి రాణా రాకతో కేరింతలు

సెమినార్‌కు సినీ హీరో దగ్గుపాటి రాణా హాజరయ్యారు. ఆయన రాకతో విద్యార్థులు భల్లాలదేవా అంటూ కేరింతలు కొట్టారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా కష్టపడి చదువుకొని వివిధ రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. తెలంగాణ ప్రభుత్వం ఉపాధి కోసం అవకాశాలు కల్పిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా బోనాల ప్రదర్శన

సందర్శకులు, విద్యార్థులను ఆకర్షించేందుకు ఉదయం 10:30గంటల నుంచి మధ్యాహ్నం వరకు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై టీజీఐసీకి చెందిన పలువురు వక్తలు సెమినార్‌ను నిర్వహించారు. భోజన సమయానంతరం జనగాం జిల్లా నుంచి వచ్చిన 12 మంది మహిళా కళాకారులు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టేలా నిర్వహించిన బోనాల ప్రదర్శన, కోలాటాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. బోనాల పాటలు వింటూ విద్యార్థులు కేరింతలు కొట్టారు. కళాశాలల విద్యార్థినులు సెమినార్ హాల్‌లో నృత్యాలు చేశారు.

సందర్శకులకు ఉచిత రవాణా సౌకర్యం

గ్లోబల్ సమ్మిట్‌కు సందర్శకు కోసం ప్రభుత్వం ఉచితంగా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసింది. మొదటి రోజు రాష్ట్ర ప్రభుత్వం వివిధ ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకుల సౌకర్యార్థం రవాణా సౌకర్యం కల్పించారు. చెంగిచర్ల, హకీంపేట, ఉప్పల్, సికింద్రాబాద్, రాజేంద్రనగర్, దిల్‌సుఖ్‌నగర్, జేబీఎస్ ఆర్టీసీ డిపోలకు చెందిన 52బస్సులతో పాటు 20ప్రైవేటు బస్సులను ఏర్పాటు చేశారు. ప్రైవేటు కార్లు, ఇతర వాహనాల్లో 5వేలకుపైగా సందర్శకులు హాజరయ్యారు. రాచకొండ సీపీ సుధీర్‌బాబు భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఫ్యూచర్ సిటీ డెలప్‌మెంట్ అథారిటీ ఎండీ శశాంక, రాష్ట్ర ప్రొటోకాల్ ఇన్‌చార్జి వెంకట్‌నర్సింహారెడ్డి, ఆర్అండ్‌బీ ఎండీ అశోకొరెడ్డి, ట్రాన్స్‌కో ఎండీ ముష్రఫ్ అలీ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తాగునీరు, భోజన వసతి

సందర్శకుల సౌకర్యార్థం సమ్మిట్ ప్రాంగణంలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనవసతితో పాటు తాగునీటి వసతిని కల్పించారు. ముందుగా అంచనాకు మించి సందర్శకుల తాకిడి అధికంగా వచ్చారు. దీంతో భోజనం సరిపోకపోవడంతో పలువురు విద్యార్థులు, సందర్శకులు ప్రైవేటు వ్యక్తులు ఏర్పాటు చేసిన స్టాళ్లలో స్నాక్స్ కొనుగోలు చేసుకోవాల్సి వచ్చింది.

భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన రాచకొండ సీపీ

సీపీ సుధీర్‌బాబు భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. బుధవారం కూడా ప్రాంగణంలో పోలీసు యంత్రాంగాన్ని మోహరించారు. సమ్మిట్‌లోని స్టాల్స్, భోజన వసతి కల్పించిన స్థలాల గురించి పోలీసు సిబ్బంది సందర్శకులకు సమాచారం ఇచ్చారు. మహేశ్వరం డీసీపీ నారాయణరెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు ఉన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థి చేసిన సైకిల్

నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి గగన్‌చంద్ర తయారు చేసిన సోలార్ బ్యాటరీ సైకిల్ గ్లోబల్ సమ్మిట్ సందర్శకులను ఆకట్టుకుంది. ఇందుకు రూ.25వేల ఖర్చు చేశాడు. సైకిల్‌కు ఎక్కడైనా ప్రమాదం జరిగితే తెలియజేయడానికి ఫోన్ చేసే వసతి ఉండటం చూసి పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

ఆకట్టుకున్న మల్టీపర్పస్ అగ్రికల్చర్ యంత్రం

సమ్మిట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాల్‌లో ఆదిలాబాద్‌కు చెందిన మహాత్మాగాంధీ జ్యోతిరావు పూలే కళాశాలకు చెందిన విద్యార్థులు రనూష, వైష్ణవి తయారు చేసిన మల్టీపర్పస్ అగ్రికల్చర్ యంత్రం సందర్శకులను ఆకట్టుకుంది. దీన్ని రూ.15వేలతో చేశామని, ముందు వరుసలో నాగలితో దున్నేందుకు, వెనుక వరుసలో ప్లవ్‌తో దుక్కిని దున్నే అవకాశం ఉందని విద్యార్థినులు వివరించారు.

తీరొక్కటొస్తున్నయని ఇక్కడకొచ్చినంక తెలిసింది



మా ఊరు దగ్గర్లో పొలాల్లో ఏదో పెద్ద ప్రోగ్రామంటని తెలిసి ఈడికి వచ్చినం. ఇక్కడ పెద్ద కంపెనీలు, కాలేజీలు, ఆటలాడేవి ఇట్లా తీరొక్కటి వస్తున్నయని ఇక్కడికి వొచ్చినంక తెలిసింది అని అంటున్నారు కందుకూరు మండలం ఆకులమైలారానికి చెందిన అనెమోని మంజులవాణి, గౌర అనిత. భారత్ ఫ్యూచర్ సిటీ కని మా పొలాలు తీసుకుండ్రు.. ముందు మాకేం అర్థం కాలే. ఇక్కడ చూస్తే రంగుల ప్రపంచం కనిపిస్తుంది. ముఖ్యమంత్రి, మంత్రులు, ఉన్నతాధికారులలతో పాటు పెద్ద కంపెనీలకు చెందినోల్లు వచ్చిండ్రని మా పిల్లలు సెల్‌ఫోన్లల్ల చూపిచ్చిండ్రు. ఇదేదో ఫోన్లల్లకంటే ఆడికి పోయి చూస్తమని వచ్చినం. ఇవన్నీ చూస్తుంటే మా పొలాలు పోయినా మా పిల్లలకు కొలువులొస్తయన్న ధీమా వచ్చిందన్నారు. రెండ్రోజుల నుంచి ఇల్లెక్కి చూస్తున్నం. ఆ లైట్లు. ఆ ఫోకస్‌లు జిగేల్ జిగేల్‌మంటున్నయ్. ఇక్కడ పెద్ద కంపెనీలొస్తే మా ఊరు రూపు రేఖలు మార్తయని అంతా అనుకుంటుండ్రు అని మంజుల, అనిత చెప్పారు.

\- పలువురు మహిళలు, ఆకులమైలారం

ఈ సమ్మిట్ తెలంగాణ భవిష్యత్తును ఆవిష్కరించింది



ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు చేసిన ఈ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ అద్భుతం. ప్రభుత్వాధినేతలు, ప్రముఖులు పాల్గొన్న ఈ సమ్మిట్ తెలంగాణ భవిష్యత్తును ఆవిష్కరించింది. ప్రభుత్వం ఏం చేయబోతుంది.. అడ్వాన్స్ టెక్నాలజీతో ఏర్పాటు చేయబోయే పరిశ్రమలకు సంబంధించి ప్రముఖ సంస్థల డెలిగేట్స్ ప్రభుత్వంతో ఒప్పందాలు(ఎంవోయూ) చేసుకోవడం మంచి పరిణామం. ఇది విద్యార్థులకే కాదు.. మా లాంటి లెక్చరర్లకు కూడా ఒక అవగాహన వచ్చింది. మీడియాలో చూసింది ఒక భాగమైతే ఇక్కడ ఫీల్డులో చూడడమనేది కళ్లకు కట్టినట్టుగా ఉంది.

\- ఫ్లోరెన్స్, సిటీ కాలేజీ లెక్చరర్, హైదరాబాద్

మాకు ఇది ఒక పాఠంగా భావిస్తున్నాం



ఎక్కడో పొలాల్లో ఫ్యూచర్ సిటీ ఏర్పాటు అంటే ఏదో అనుకున్నం. ప్రభుత్వం, ప్రముఖ పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్న ఈ సమ్మిట్‌ను మేమొక పాఠంగా భావిస్తున్నాం. పుస్తకాలు తిరిగేయడం వేరు.. ఇక్కడ మేం చాలా విషయాలు తెలుసుకున్నం. వివిధ రంగాలకు చెందిన స్టాళ్లు కూడా ఆకట్టుకున్నయ్. ముఖ్యంగా ఇక్కడ ఏర్పాటయ్యే పరిశ్రమలను చూస్తే మున్ముందు యువతకు ఎక్కువ సంఖ్యలో ఉద్యోగాలు రావడానికి ఇది దోహదం చేస్తుందని చెప్పవచ్చు. ఇది ఒక రకంగా స్ఫూర్తినిచ్చేదిగా ఉంది.

\- ఐశ్వర్య, డిగ్రీ మొదటి సంవత్సరం, సిటీ కాలేజి

ఆనందంగా ఉంది



ఫ్యూచర్ సిటీ దగ్గర చూస్తే ఆనందంగా ఉంది. మాకిది కొత్తగా కనిపిస్తుంది. చూద్దామని వచ్చినం.. సెల్ఫీ తీసుకుని మా పిల్లలకు, సుట్టు పక్కల వాల్లకు చూపిస్త..

\- లక్ష్మి, మంగల్‌పల్లి, ఆమనగల్లు మండలం

నాయకుల కనుసన్నల్లో జీపీ ఎన్నికలు!

● రెబల్స్‌పై పార్టీల సస్పెన్షన్ వేటు





యాచారం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాజకీయాలకు అతీతంగా జరగాల్సిన గ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తిగా రాజకీయ నాయకుల కనుసన్నల్లో జరుగుతున్నాయి. చాలా గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థులను పార్టీల నాయకులే ఎంపిక చేశారు. గురువారం మొదటి విడత జరుగుతున్న ఎన్నికలను కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. యాచారం బీఆర్ఎస్ మాజీ జెడ్పీటీసీ దంపతులు కాంగ్రెస్ అభ్యర్థులకు సపోర్ట్ చేయడంతో వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. మేడిపల్లిలో బీఆర్ఎస్ రెబల్ నామినేషన్ వేయడంతో ఐదుగురిని సస్పెండ్ చేశారు. మొండిగౌరెల్లిలో బీజేపీకి చెందిన ఇద్దరు నాయకులు తమ కుటుంబానికి చెందిన మహిళలను బరిలో దింపారు. మాల్‌లో ఇద్దరు కాంగ్రెస్ నాయకులు బరిలో నిలిచారు. రెండు రోజుల్లో రెబల్స్ బరి నుంచి తప్పుకోకుంటే సస్పెండ్ చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఎక్కువ సర్పంచ్ స్థానాల్లో గెలిస్తే ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సొసైటీ పదవుల కైవసం సులువవుతుందని ప్రధాన పార్టీల నాయకులు భావిస్తున్నారు. కాగా, ఫార్మాసిటీ బాధిత గ్రామాల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు ప్రత్యేక దృష్టి సారించారు

ఎన్నికల విధులకు టీచర్ల డుమ్మా

● నాలుగు మండలాల్లో 245 మంది గైర్హాజరు
● డ్యూటీకి రాని వారిని సస్పెండ్ చేస్తామన్న ఎన్నికల నోడల్ అధికారి



మైకులో ఎన్నికల సిబ్బందిని పిలుస్తున్న నోడల్ అధికారి సుశీంద్రరావు

షాద్‌నగర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలను ప్రభుత్వ ఉపాధ్యాయులు పట్టించుకోలేదు. ఎన్నికల విధులకు కొందరు రాలేదు. రిజర్వ్‌లోని ఉపాధ్యాయులు సైతం ఎలక్షన్ విధులకు ఎగనామం పెట్టారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద ఎన్నికల అధికారులు మైకుల్లో పిలిచినా వారు రాకపోవడంతో అప్పటికప్పుడు ఎలాంటి శిక్షణ లేని ప్రైవేటు టీచర్లకు ఎన్నికల విధులను అప్పగించారు. ఈ విషయం తెలుసుకున్న రంగారెడ్డి జిల్లా ఎన్నికల నోడల్ అధికారి, డీఈవో సుశీంద్రరావు తీవ్రంగా స్పందించారు. విధులకు హాజరుకాని వారిని ఉద్యోగం నుంచి సస్పెండ్ చేస్తామని ప్రకటించారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప ఎన్నికల విధులకు హాజరుకావాలనున్నా సమాచారమైనా ఇవ్వకుండా రాకపోవడం నిబంధనల ఉల్లంఘనేనని అధికారులు మండిపడ్డారు.

విధులకు 245 మంది ఎగనామం

షాద్‌నగర్ నియోజవర్గంలో 245 మంది ఎన్నికల విధులకు డుమ్మా కొట్టారు. ఉదయం 9గంటల నుంచే మండల కేంద్రాల్లో ఎన్నికల ఏర్పాట్లు చేశారు. 10గంటలకల్లా ఎన్నికల డ్యూటీ ఉన్నవారంతా రిపోర్ట్ చేయాలని జిల్లా నోడల్ అధికారి సుశీందర్‌రావు ఆదేశించారు. సాయంత్రం నాలుగైనా కొందరు రిపోర్ట్ చేయలేదు. ఫోన్లకూ స్పందించలేదు. మైకుల్లో పేర్లతో పిలిచినా హాజరుకాలేదు. రిజర్వ్ సిబ్బంది కోసం అనౌన్స్ చేసినా వారిలో సగం మంది కూడా ఎన్నికల విధులకు రాలేదు. ఫరూఖ్‌నగర్ మండలంలో 120, కొత్తూరు మండలంలో 25 మంది, నందిగామ మండలంలో 20 మంది, చౌదరిగూడ మండలంలో 80 మంది చొప్పున ఉపాధ్యాయులు పంచాయతీ ఎలక్షన్ విధులకు హాజరు కాలేదు.



పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న అధికారి కుసుమ మాధురి

పోలింగ్ బూత్‌ల పరిశీలన

ఆమనగల్లు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలకు ఆమనగల్లు మండలంలో ఏర్పాట్లు పూర్తిచేసినట్లు జిల్లా ఎన్నికల సహాయ అధికారి కుసుమ మాధురి తెలిపారు. బుధవారం మేడిగడ్డ తండా పోలింగ్ బూత్‌ను ఆర్వో అనంతరెడ్డితో కలిసి ఆమె సందర్శించారు. వసతులను పరిశీలించి పోలింగ్ స్టేషన్ నంబర్లను వేయించారు. పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లకు తగిన ఏర్పాట్లుచేయాలని ఎన్నికల సిబ్బందికి సూచించారు. మండలంలో పంచాయతీ ఎన్నికలకు సంబంధించి 92 పోలింగ్ బూత్‌లను ఏర్పాట్లు చేసినట్లు ఆమె తెలిపారు.

నేటి నుంచి పోస్టల్ బ్యాలెట్ల స్వీకరణ ..

మండల పరిషత్‌లో పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు మాధురి తెలిపారు. ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు ఆర్వో రమాదేవి పోస్టల్ బ్యాలెట్లను స్వీకరిస్తారని చెప్పారు. సర్వీస్ ఓటర్లు, జవాన్లు, ఇతర ప్రాంతాల్లో ఉద్యోగం చేసే ఇక్కడి ఓటర్లు, ఎన్నికల డ్యూటీ పడిన ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలని ఆమె సూచించారు.

ప్రజా భాగస్వామ్యంతోనే శాంతి

● రాష్ట్రపతి కార్యాలయ మాజీ ఓఎస్డీ సత్యనారాయణ సాహు



పుస్తకావిష్కరణ చేస్తున్న సత్యనారాయణ సాహు, లింబాద్రి తదితరులు

చేవెళ్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిజమైన శాంతి ప్రభుత్వాలు, ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యం అని రాష్ట్రపతి కార్యాలయ మాజీ ఓఎస్డీ, ప్రెస్ సెక్రటరీ సత్యనారాయణ సాహు అన్నారు. బుధవారం చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో.. 'సంయుక్త రాజ్య సమితి ఎస్‌డీజీ-16శాంతి, న్యాయం, బలమైన సంస్థలు' అనే అంశాలపై జాతీయ సదస్సు నిర్వహించారు. మొదటి రోజు గురువారం సత్యనారాయణ సాహు, తెలంగాణ ఉన్నత విద్యామండలి మాజీ చైర్మన్ ఆర్.లింబాద్రి, ప్రొఫెసర్లు ఎం.రాములు, కె.ముత్యంరెడ్డి, సురేందర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్, ఎం.గంగాధర్, అలీంఖాన్‌పలాకీ, నర్సయ్య హాజరయ్యారు. పుస్తకావిష్కరణ చేశారు. విద్యావేత్తలు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొని సామాజిక రాజకీయ అంశాలపై చర్చించారు. సత్యనారాయణ సాహు మాట్లాడుతూ.. ఢిల్లీ పరిస్థితులతో పోల్చితే చేవెళ్లలో స్వచ్ఛమైన గాలి ఉందన్నారు. కాలుష్యంతో ఢిల్లీలో ఎయిర్ ప్యూరిఫయర్లు అవసరమయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. శుభ్రమైన గాలి పొందడం ప్రాథమిక న్యాయం అన్నారు. మహిళల భద్రత, గౌరవం అవకాశాలు కర్తవ్యాలని తెలిపారు. అంతకు ముందు ఆర్.లింబాద్రి మాట్లాడుతూ.. బలమైన సంస్థల నిర్మాణానికి ఆత్మ, శాంతి, కరుణ ముఖ్యమన్నారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. ఎస్‌డీజీ-16 ఆత్మగా రాజ్యాంగం నైతిక నిర్మాణానికి ఆధారమని వివరించారు. ప్రిన్సిపాల్ కాంచనలత, సదస్సు కన్వీనర్ అబ్దుల్ మాలిక్, అధ్యాపకులు కవిత, పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చలి పంజా

(ఐదో పేజీ తరువాయి)

అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే వికారాబాద్ జిల్లా మోమిన్‌పేటలో 6.9 డిగ్రీలు, మేడ్చల్ జిల్లా ఉప్పల్‌లో 9.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గడిచిన ఐదేళ్లలో ఇక్కడ ఇవే కనిష్ఠ ఉష్ణోగ్రతలు కావడం గమనార్హం. చలిగాలుల ఉధృతి పెరిగి రాత్రిళ్లు జనం బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో సాయంత్రమే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. తెల్లవారుజామున మంచు విపరీతంగా కురుస్తోంది. ఉదయం వేళ మంచు రహదారులను కప్పేయడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రానున్న రోజుల్లో ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు 5 డిగ్రీలకు పడిపోయే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి

- పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి
- మొదటి విడత తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లోని 8 మండలాల్లో పోలింగ్ : వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్



తాండూరులో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

తాండూరు రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి):వికారాబాద్ జిల్లా తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లో మొదటివిడత పంచాయతీ ఎన్నికల్లో భాగంగా 8 మండలాల్లోని 225 గ్రామ పంచాయతీలు, 1,112 వార్డుల్లో గురువారం(నేడు) పోలింగ్ నిర్వహిస్తున్నామని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. బుధవారం తాండూరు మండల పరిషత్ వద్ద ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూటషన్ కేంద్రాన్ని, పోలింగ్ సిబ్బందికి అందజేస్తున్న ఎన్నికల సామాగ్రిని ఆయన పరిశీలించారు. ఎన్నికలు ఎలా నిర్వహిస్తారనే విషయమై పలువురు ప్రిసైడింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల్లో ఇబ్బందులు తలెత్తకుండా పోలింగ్‌కు ముందే అన్ని అంశాలపై ఒకటికి రెండుసార్లు సరి చూసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఓటర్లు తమకు నచ్చిన అభ్యర్థికి స్వేచ్ఛగా ఓటు వేయాలని ఆయన సూచించారు. మండలాల్లో పోలింగ్‌ను ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఎంపీవోలు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారని చెప్పారు. వారితో జోన్ ఆఫీసర్లు ఎన్నికల సరళిని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకూ గ్రామాల్లో నిరంతరం పోలీసుల నిఘా ఉంటుందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించామని చెప్పారు. సిబ్బంది సౌకర్యవంతంగా పని చేసేలా, అలాగే ఓటర్లు ప్రశాంతంగా ఓటు వేసేలా చర్యలు చేపట్టామన్నారు. అందరూ తమ ఓటు హక్కును వినియోగించాలని సూచించారు. ఎన్నికలకు ఏర్పాట్లన్నీ పూర్తి చేసినట్లు కలెక్టర్ చెప్పారు.

అభ్యర్థుల్లో టెన్షన్..

- రంగారెడ్డి జిల్లా 7 మండలాల్లో నేడు ఎన్నికలు
- తేలనున్న అభ్యర్థుల భవితవ్యం
- అందలమెక్కేదెవరో?
- అప్పుల్లో కూరుకుపోయేవారెందరో?!



షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల ప్రక్రియలో నిమగ్నమై కునుకు లేకుండా రాత్రింబవళ్లు బిజీగా గడిపిన అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. గురువారం ఉదయం 7గంటల నుంచి మొదలవనున్న మొదటి విడత ఎన్నికల్లో ఓటర్లు ఎవరిని కరుణిస్తారోనన్న భయం పట్టుకుంది. ప్రచారంలో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు వివిధ ప్రలోభాలకు గురి చేస్తూ మందు, విందులు ఏర్పాట్లు చేసి.. డబ్బులు, కానుకలు పంచారు. ఓటర్ల కాళ్లపై పడి వేడుకున్నారు. ఇలా ఎన్ని చేసినా చివరకు పోలింగ్ బూత్‌లోకి వెళ్లి ఎవరి గుర్తుకు ఓటేస్తారోననే భయం అభ్యర్థులందరికీ పట్టుకుంది. మరి కొన్ని గంటల్లోనే వారి రాజకీయ భవితవ్యం తేలనుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి అభ్యర్థులు ఎన్నికల ఖర్చు చేశారు. గెలిచిన వారి పరిస్థితి ఎలా ఉన్నా ఓడిన వారు మాత్రం చాలా మట్టుకు అప్పులపాలు అవుతారనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. రంగారెడ్డి జిల్లాలో ఏడు మండలాల్లో గురువారం పోలింగ్ జరగనుంది. షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొత్తూర్, కొందుర్గు, కేశంపేట, ఫరూఖ్‌నగర్, నందిగామ, జిల్లేడ్‌చౌదరిగూడ, రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని శంషాబాద్ మండలం 168సర్పంచ్ పదవులకు 530 మంది, అలాగే 1,340 వార్డు పదవులకు 3,379 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు.

పోటీ ప్రతిష్ఠాత్మకం...

- గ్రామాల్లో భారీగా ఎన్నికల హామీలు
- లక్షల్లో ఖర్చు చేస్తున్న అభ్యర్థులు



మొయినాబాద్ రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల పోటీలోని అభ్యర్థులు రాజకీయ పార్టీలను మించి హామీలు గుప్పిస్తున్నారు. వివిధ పథకాలను వర్తింపజేస్తామంటూ ప్రకటిస్తున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు వచ్చినా రాకున్నా తామే సొంతంగా గ్రామాభివృద్ధికి ఎంతైనా ఖర్చు చేస్తామని గ్రామస్తులకు హామీ ఇస్తున్నారు. ఇవన్నీ ఇప్పుడు ఎన్నికల్లో వెచ్చిస్తున్న డబ్బుకు అదనమే. ఎందుకంటే ఎన్నికల్లో ఎంత వెచ్చించినా గెలిచిన తరువాత హామీల అమలుకు సైతం భారీ మొత్తమే వెచ్చించాల్సి ఉంటుంది. మండలంలోని ఓ గ్రామంలో సర్పంచ్‌గా పోటీ చేస్తున్న అభ్యర్థిని 'ప్రజలే నా బలం.. యువతే నా సైన్యం.. గ్రామాభివృద్దే నా ధ్యేయం' అని మ్యానిఫెస్టో ప్రకటించారు.

గ్రామస్తులకు ఇస్తున్న హామీలివీ..

- పుణ్యవతి తల్లి దీవెన పేరిట గ్రామంలోని ప్రతీ ఆడపడచు వివాహానికి రూ.41వేల ఆర్థిక సహాయం.
- గ్రామంలో జన్మించిన ప్రతి శిశువుకు రూ.11వేల అందజేత. కొత్త పంచాయతీ, డ్వాక్రా భవనాల నిర్మాణం.
- ప్రజలకు ఉచితంగా నీరందించేందుకు వాటర్ ప్లాంటు ఏర్పాటు. ఉచిత అంబులెన్స్ సౌకర్యం.
- గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు. గ్రామస్తులకు ఉచిత వైఫై వసతి వంటి హామీలు గుప్పిస్తున్నారు.

ఉప సర్పంచ్‌ల ఎన్నిక ప్రక్రియ పూర్తి



ఏకగ్రీవమైన సర్పంచ్ మాధవి, ఉపసర్పంచ్ శివకుమార్, వార్డు సభ్యులు

కులకచర్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలో ఏకగ్రీవమైన నాలుగు గ్రామాల్లో బుధవారం అధికారులు ఉపసర్పంచ్‌ల ఎన్నిక నిర్వహించారు. తిరుమలాపూర్ ఉపసర్పంచ్‌గా శివకుమార్, దాస్యనాయక్ తండా సూరిబాయి, బోట్యానాయక్‌తండా ప్రకాశ్, ఎత్తుకాల్వతండా ఉప సర్పంచ్‌గా జ్యోతిలు ఎన్నికయ్యారు. మండలంలో 33 పంచాయతీలకు 4 ఏకగ్రీవమయ్యాయి. మరో 29 పంచాయతీలకు 80మంది సర్పంచ్ అభ్యర్థులు పోటీలో ఉన్నారు. 280వార్డులకు 80 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. 200 వార్డులకు 540 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

ప్రగతి నిరోధకులకు ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలి

● ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



చరికొండ ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ తోనే సామాజిక న్యాయం, గ్రామాల అభివృద్ధి సాధ్యం అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల మండలాల్లో బుధవారం ఎమ్మెల్యే పర్యటించారు. చరికొండ, పల్లెచెలుకతండా, చింతలపల్లి గ్రామాల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థుల తరఫున ప్రచారంలో పాల్గొన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో గ్రామాల్లో ఎంతో ప్రగతి జరిగిందన్నారు. ఓర్వలేని అవకాశవాదులు, అభివృద్ధి నిరోదకులకు ప్రజలు ఓటు వెయ్యకుండా గుణపాఠం చెప్పాలన్నారు. నియోజకవర్గంలో 90శాతం పంచాయతీల్లో కాంగ్రెస్ మద్దతుదారుల విజయం ఖాయం అన్నారు. ప్రజల కోసం పాటుపడేవారినే సర్పంచ్‌లుగా గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండలాల అధ్యక్షులు బీచ్యానాయక్, జగన్, నాయకులు హన్మనాయక్, పాలకూర్ల రాములు, వెంకటయ్య, అంజి, సత్యం, నర్సింహ, లక్ష్మమ్మ, రమేశ్, బాల్‌రాజ్, దీప్లా ఉన్నారు.

ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేయాలి



ఎన్నికల బందోబస్తుపై పోలీసులకు సూచనలు ఇస్తున్న డీసీపీ రాజేశ్

నందిగామ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని శంషాబాద్ డీసీపీ రాజేశ్ అన్నారు. బుధవారం నందిగామలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఎన్నికల నిర్వహణపై పోలీసులకు సూచనలిచ్చారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతల పర్యవేక్షణ కోసం ఒక ఏసీపీ, ఇద్దరు సీఐలు, 20 మంది వెపన్ పార్టీ పోలీసులు, 200 మంది సాధారణ పోలీసులను పోలింగ్ కేంద్రాల వద్ద నియమించినట్లు వివరించారు. నందిగామ, మొదళ్లగూడ, మామిడిపల్లి గ్రామాలను సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించినట్లు డీసీపీ వెల్లడించారు. ప్రజలు పోలింగ్ కేంద్రానికి 200మీటర్ల దూరంలో ఉండాలని సూచించారు. ఓటర్లు పోలింగ్ బూత్‌లలోకి సెల్‌ఫోన్, వాటర్ బాటిల్స్ తీసుకురావొద్దని తెలిపారు. ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులు ఊరేగింపులు తీయకూడదని, బాణసంచా కాల్చొద్దని పేర్కొన్నారు. ఎవరైనా కించపరిచే వ్యాఖ్యలు చేయడం, గొడవలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

కొత్తూర్: ఎన్నికల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని డీసీపీ రాజేష్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే చర్యలు తప్పవన్నారు. ఏసీపీ గంగాధర్, ఇన్‌స్పెక్టర్ నర్సయ్య, పాల్గొన్నారు.

ఎన్నికల విధులు సక్రమంగా నిర్వర్తించాలి

షాద్‌నగర్ రూరల్: పంచాయతీ ఎన్నికల విధులు సక్రమంగా నిర్వర్తించాలని శంషాబాద్ అడిషినల్ డీసీపీ పూర్ణచందర్ సూచించారు. పట్టణంలోని ఓ గార్డెన్‌లో మంగళవారం పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలింగ్ మొదలు ఫలితాలు వెలువడే వరకు పోలీసులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలో ఇద్దరు ఏసీపీలు, పది మంది సీఐలు, 30మంది ఎస్సైలు, 500 మందికిపైగా పోలీసులు విధుల్లో ఉంటారని తెలిపారు.



మాట్లాడుతున్న అడిషినల్ డీసీపీ పూర్ణచందర్

నేనూ సత్యసాయి భక్తుడినే ...

● స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



రథయాత్రను ప్రారంభిస్తున్న అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్

వికారాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తాను కూడా భగవాన్ శ్రీ సత్యసాయి బాబా భక్తుడనేనని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. బుధవారం పుట్టపర్తి ప్రేమ ప్రవాహిని రథం పుట్టపర్తి నుంచి వికారాబాద్‌లోని భగవాన్ శ్రీ సత్యసాయి జ్ఞాన కేంద్రానికి చేరుకుంది. ఈ రథాన్ని పట్టణంలో యాత్ర నిర్వహించగా స్పీకర్ ముఖ్య అతిథిగా హాజరై యాత్రను ప్రారంభించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్పీకర్ మాట్లాడుతూ.. సత్యం ధర్మ శాంతి ప్రేమ అహింస ఐక్యత వంటి బాబా తెలిపిన సందేశాలను వ్యాప్తి చేయడమే ఈ రథ యాత్ర ఉద్దేశమన్నారు. దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే చాలా దేశాల్లో ప్రేమ శాంతి సమైక్యత పెంపొందించడంలో సత్యసాయి కృషి చేశారని, దేశంలో అనేక గ్రామాలు పట్టణాల్లో సత్యసాయి కేంద్రాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎల్లప్పుడూ జరుగుతూనే ఉన్నాయని తెలిపారు. రథయాత్ర ప్రశాంతి నగర్ నుంచి ప్రారంభమై జగ్జీవన్‌రామ్ చౌరస్తా, ఎన్టీఆర్ చౌరస్తా బసవేశ్వర చౌరస్తా శ్రీ రామ మందిర్‌ల నుంచి మల్లికార్జున ఆలయం మీదుగా అంబేడ్కర్ చౌరస్తా నుంచి తిరిగి సత్యసాయి జ్ఞాన కేంద్రానికి చేరుకుందని కన్వీనర్ సత్యనారాయణగౌడ్ తెలిపారు. రథయాత్రలో సేవాదళ్ సభ్యులు భక్తులు, మహిళలు, విద్యార్థులు, వ్యాపారులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు. భజనలు, కోలాటంతో వెళ్లారు. కార్యక్రమంలో తాండూరు, కేరెల్లి, వికారాబాద్, పరిగి, రంగాపూర్, మాదారం కొడంగల్ నుంచి వచ్చిన సత్యసాయి సేవా సమితి కన్వీనర్లు, సభ్యులు పాల్గొన్నారు. అంతే కాకుండా పుర ప్రముఖులు మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ మంజుల, వి.సత్యనారాయణ, జగదీశ్వర్‌సింగ్, స్పిరిచ్యువల్ కో-ఆర్డినేటర్ బందప్పగౌడ్, యూత్ కోఆర్డినేటర్ బసవేశ్వర్, మహిళా కార్యకర్తలు అనురాధ, కే.వర్ధిని, సత్యనారాయణ పాల్గొన్నారు.

పండుగల సాయన్న ఆశయాలను సాధిద్దాం

చేవెళ్ల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పోరాటా యోధుడు పండుగల సాయన్న ఆశయ సాధనకు కృషిచేస్తామని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ సంఘం కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ తెలిపారు. సాయన్న వర్ధంతి సందర్భంగా బుధవారం చేవెళ్లలోని విగ్రహానికి నివాళులు అర్పించారు. పోరాట యోధుడు పండుగల సాయన్న చూపిన మార్గంలో పయనిస్తున్నట్లు చెప్పారు. చరిత్రలో పండుగల సాయన్నకు సముచితస్థానం ఉందన్నారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ముదిరాజ్‌ల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ చైర్మన్ తలారి మల్లేష్, చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పామెన భీం భరత్, ముదిరాజ్ సంఘం చేవెళ్ల, శంకర్‌పల్లి మండలాధ్యక్షులు నర్సింలు, మైసయ్య, నాయకులు శివారాజ్, శ్రీకాంత్, గోపాల్, శ్రీరామ్‌లు, శ్రీనివాస్, రాంప్రసాద్, నర్సింలు, రాజశేఖర్, జంగయ్య, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



సాయన్న విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

షాద్‌నగర్ వైద్యుడికి జాతీయ పురస్కారం



పురస్కారాన్ని అందుకుంటున్న డాక్టర్ వంశీ కేశవరం

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ రంగరాయ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ వంశీ కేశవరం జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. ఢిల్లీలో బుధవారం కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తరఫున బిహార్ మంత్రి జీవేష్ మిశ్రా నుంచి వంశీ రాష్ట్రీయ చికిత్సా సేవాశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు. ఉత్తమ సేవలకిచ్చే అవార్డిది.

గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా

● తిప్పాయిగూడ బీజేపీ మద్దతు సర్పంచ్ అభ్యర్థి వెదిరె రమాదేవి జగదీశ్వర్‌రెడ్డి



ఇంటింటి ప్రచారంలో రమాదేవి జగదీశ్వర్‌రెడ్డి



మంచాల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గ్రామపెద్దల సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని బీజేపీ మద్దతు తిప్పాయిగూడ సర్పంచ్ అభ్యర్థి వెదిరె రమాదేవి జగదీశ్వర్‌రెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. పార్టీ నేతలతో కలిసి బుధవారం గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫుట్‌బాల్‌గుర్తుకు ఓటువేసి తనను సర్పంచ్‌గా గెలిపించాలంటూ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వెదిరె రమాదేవి మాట్లాడుతూ చారిత్రక నేపథ్యం గల మన ఊరుకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చేందుకు కృషి చేస్తానన్నారు. మంచాల-చిత్తాపూర్-తిప్పాయిగూడ-ముకునూరు రోడ్డు రీబీటీ విస్తరణకు నిధులు సాధిస్తానని చెప్పారు. పేదల కష్టసుఖాల్లో భాగస్వామినవుతానని అన్నారు. వచ్చే ఐదేళ్లపాటు ఇంటి పన్ను, నల్లా బిల్లులు తానే చెల్లిస్తానని హామీ ఇచ్చారు. వచ్చే ఐదేళ్లలో సరైన ప్రణాళికను రూపొందించుకొని విడతల వారీగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సర్పంచ్ అభ్యర్థి వెంట పార్టీ ముఖ్యనేతలు, 8 వార్డుల అభ్యర్థులు పాల్గొన్నారు.

నేడే తొలి పోరు

(ఐదో పేజీ తరువాయి)

వెల్లడిస్తారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పోలీసు అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బలగాలను కేటాయించారు. షాద్‌నగర్ నియోజకవర్గం పరిధితో పాటు శంషాబాద్ మండలంలో 174 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో ఆరుగురు సర్పంచ్ అభ్యర్థులు ఏకగ్రీవం కాగా, 168 గ్రామపంచాయతీల్లో 530 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. అలాగే 1530 వార్డులకుగాను 190 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. 1340 వార్డు స్థానాల్లో 3,379 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని ఫరూఖ్‌నగర్, కొత్తూరు, నందిగామ, కేశంపేట, కొందుర్గు, చౌదరిగూడ మండలాల పరిధిలో 180,634 మంది ఓటర్లు ఉండగా రాష్ట్ర ఎన్నికల సంఘం 1387పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేసి 2894పోలింగ్ సిబ్బందిని నియమించింది. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. మండల కేంద్రాల్లో ఉన్న సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి 250 నుంచి 500 మంది పోలీసులను అక్కడ కేటాయించింది. ఇదివరకే అన్ని మండల కేంద్రాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ కవాతు నిర్వహించింది. ఓటర్లపై దాడులకు దిగితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ హెచ్చరించారు.



షాద్‌నగర్‌లో ఎన్నికల సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఆర్డీవో సరిత

పోలింగ్ సామగ్రి అందజేత

కొత్తూర్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. మండల రిటర్నింగ్ అధికారుల పర్యవేక్షణలో ఎన్నికల సిబ్బందికి పోలింగ్ సామాగ్రిని అందజేశారు. మండలంలోని మొత్తం 12 గ్రామపంచాయతీలకు గాను 110 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. దాదాపు 260 మంది ఎన్నికల సిబ్బంది పాల్గొంటున్నారు. ఎన్నికల సిబ్బంది పోలింగ్ సామగ్రితో పోలీస్ బందోబస్తు మధ్య ఆయా వాహనాల్లో గ్రామాలకు బయలుదేరి వెళ్లారు. మండల ఎన్నికల అధికారులు తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపీడీవో డాక్టర్ అరుంధతి, ఎంఈవో అంగోర్‌నాయక్‌లు పాల్గొన్నారు.

గెలిపిస్తే గ్రామంలో ప్రగతి కాంతులు

● ప్రచారంలో ప్రొద్దటూరు సర్పంచ్ అభ్యర్థి బండ లక్ష్మీనర్సింహ



ప్రచారం నిర్వహిస్తున్న బండ లక్ష్మీనర్సింహ

శంకర్‌పల్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌గా తనను గెలిపిస్తే గ్రామంలో ప్రగతి కాంతులు నింపుతానని ప్రొద్దటూరు సర్పంచ్ అభ్యర్థి బండ లక్ష్మీనర్సింహ తెలిపారు. కత్తెర గుర్తుకే ఓటువేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని గ్రామస్తులను వేడుకున్నారు. బుధవారం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ.. తాను గెలిచిన అనంతరం పెద్దల సహకారంతో ప్రజాసమస్యలను వెంటనే పరిష్కరిస్తానన్నారు. కత్తెర గుర్తుకు ఓటేసి తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను వేడుకున్నారు. తన అత్త బండ ముత్తమ్మ ఇది వరకే సర్పంచ్, ఎంపీటీసీగా గ్రామానికి ఎంతో సేవ చేశారని గుర్తు చేశారు. ఆమె హయాంలో గ్రామం అన్నిరంగాల్లో చెందిందని వివరించారు. ప్రజల సహకారంతోనే తమ కుటుంబం ఇదివరకు ఎంతో సేవ చేయడం జరిగిందని, ఇప్పుడు కూడా వారి సహకారం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. గ్రామంలో మిగిలిపోయిన సీసీ రోడ్లు, అంతర్గత మురుగుకాలువలు నిర్మించి పరిశుభ్రతకు పెద్దపీట వేస్తానని, గ్రామస్తులు తనను సర్పంచ్‌గా గెలిపిస్తే నిత్యం అందుబాటులో ఉంటానని తెలిపారు. గ్రామ పెద్దల సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధిచేసి చూపుతానని ధీమా వ్యక్తం చేశారు. తనను గెలిపించి సేవచేసే భాగ్యం కల్పించాలని గ్రామస్తులను వేడుకున్నారు.

మైసిగండికి సేవకురాలిగా పనిచేస్తా

● మైసిగండి కాంగ్రెస్ మద్దతు సర్పంచ్ అభ్యర్థి ప్రేమ జవహర్‌లాల్ నాయక్



ప్రచారంలో ప్రేమ జవహర్‌లాల్ నాయక్

కడ్తాల్, డిసెంబరు 10(ఆంధ్ర జ్యోతి): మైసిగండి సర్పంచ్‌గా అవకాశం కల్పిస్తే నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ పాలకురాలిగా కాక సేవకురాలుగా పనిచేస్తానని మైసిగండి కాంగ్రెస్ మద్దతు సర్పంచ్ అభ్యర్థి ప్రేమజవహర్‌లాల్ నాయక్ అన్నారు. గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజలకు పట్టణాలకు దీటు గా మౌలిక వసతులు కల్పించి ఇబ్బందులు లే కుండా చూస్తానన్నారు. ఈమేరకెఉ సర్పంచ్ అభ్యర్థి జటావత్ ప్రేమ జవహర్‌లాల్ నాయక్ బుధవారం గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించా రు. పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మా జీ ఎంపీపీ రామావత్ సిరోలిపంతూ, మాజీ సర్పంచ్‌లు రామావత్ తులసీరామ్ నాయక్, మాదారం శేఖర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకుడు హీరాసింగ్‌లతో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. కత్తెర గుర్తుకు ఓటేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. వార్డు సభ్యుడిగా తన భర్త జవహర్‌లాల్ నాయక్ గ్రామాభివృద్ధికి కృషి చేశారని, సామాజికంగా ఎన్నోసేవలు అందించారని వివరించారు. నాయకులు తులసీరామ్‌నాయక్, బాబులాల్ నాయక్, బస్సీనాయక్, రాజునాయక్, వినోద్ నాయక్, దూద్యనాయక్, పత్యనాయక్, బీచ్యనాయక్, లక్ష్మణ్‌నాయక్, పంత్యనాయక్, అ మర్‌సింగ్ నాయక్, బిక్కు నాయక్, రూప్‌సింగ్ నాయక్, చందర్‌నాయక్, సుమన్‌నాయక్, శ్రీను నాయక్, రవినాయక్, చత్రునాయక్, భాస్కర్, అరుణ్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

అవకాశమివ్వండి అభివృద్ధి చేస్తా

కమ్మెట సర్పంచ్ అభ్యర్థి బుద్ద సతీశ్‌గౌడ్



ఇంటింటి ప్రచారంలో సతీశ్‌గౌడ్



బుద్ద సతీశ్‌గౌడ్

చేవెళ్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కమ్మెట గ్రామ ప్రజలకు నాయకుడిగా కాకుండా సేవకుడిగా పని చేస్తానని, ఉంగరం గుర్తుకు ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కమ్మెట సర్పంచ్ అభ్యర్థి బుద్ద సతీశ్‌గౌడ్ ప్రజలను కోరారు. బుధవారం కమ్మెట గ్రామ పంచాయతీ పరిధిలోని మాజీ సర్పంచులు పాండురంగం, పెంటయ్య, రాంచంద్రయ్య, పట్లోళ్ల హన్మంత్‌రెడ్డి, తులసీరాజు, మాజీ ఎంపీటీ జంగయ్య ఇతర నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఉంగరం గుర్తుకు ఓటు వేయాలని చెబుతూ ప్రచారంలో తనదైన శైలిలో ప్రజలను ఆకట్టుకుంటున్నారు. కమ్మెట అభివృద్ధికి నిరంతరం పటుపడుతానని, తనను సర్పంచ్‌గా ఆశీర్వదించాలని కోరారు. కమ్మెట సర్పంచ్‌గా తనకు ఒక్క అవకాశమిస్తే గ్రామాన్ని జిల్లాలోనే ఆదర్శంగా వంతంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. ప్రజలందరి సలహాలు, సూచనలు స్వీకరించి గ్రామ అభివృద్ధికి బాటలు వేస్తానన్నారు. ఉంగరం గుర్తుకు ఓటువేయాలని ఓటర్లను అభ్యర్థించారు. బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు అంజన్‌గౌడ్, నాయకులు అంతయ్యగౌడ్, మాధవగౌడ్, పాండుగారెడ్డి, వెంకటేశ్, సురేందర్ గౌడ్, గోపాల్, జంగయ్య, వెంకటేశ్, హన్మయ్య, మోహనయ్య, సుభాన్‌రెడ్డి, రామకృష్ణ, సుధాకర్, దర్శన్, కాంత్, రాజు గ్రామస్తులు ఉన్నారు.

ఫుట్‌బాల్ గుర్తుకు ఓటేసి గెలిపించండి

● గోపులారం సర్పంచ్ అభ్యర్థి తంగడిపల్లి రవిందర్‌రెడ్డి



ప్రచారం నిర్వహిస్తున్న తంగడిపల్లి రవిందర్‌రెడ్డి

శంకర్‌పల్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామస్తులు తనను సర్పంచ్‌గా ఆదిరించి సేవచేసే భాగ్యం కల్పించాలని గోపులారం సర్పంచ్ అభ్యర్థి తంగడిపల్లి రవిందర్ రెడ్డి కోరారు. బుధవారం గ్రామపెద్దలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించి ఫుట్‌బాల్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను వేడుకున్నారు. తనను ఆశీర్వదించి ఆదరిస్తే గ్రామస్తులను నిత్యం అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందేలా అహర్నిశలు పాటుపడతానని తెలిపారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు వచ్చేలా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. పేదలు అభివృద్ధి చెందితేనే గ్రామం అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. గోపులారం గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్ది గ్రామస్తుల మన్ననలు పొందేలా పనిచేస్తానన్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అన్నిఒక్కసారి తనకు అవకాశం ఇచ్చి సేవ చేసే భాగ్యం కల్పించాలని కోరారు. తనపై నమ్మకముంచి ఫుట్‌బాల్ గుర్తుకు ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన గ్రామస్తులను వేడుకున్నారు.

ప్రజలకు నిస్వార్థంగా సేవలందిస్తా

● పిల్లిగుండ్ల సర్పంచ్ అభ్యర్థి ధరణి పద్మ అయిలయ్య



ఓటర్లకు గుర్తును చూపుతూ ఓట్లు అభ్యర్థిస్తున్న సర్పంచ్ అభ్యర్థి ధరణి పద్మ అయిలయ్య

శంకర్‌పల్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌గా తనకు అవకాశమిస్తే గ్రామానికి నిస్వార్థంగా సేవలందిస్తానని పిల్లిగుండ్ల సర్పంచ్ అభ్యర్థి ధరణి పద్మ అయిలయ్య తెలిపారు. బుధవారం గ్రామంలో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఉంగరం గుర్తుకు ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను వేడుకున్నారు. సేవచేసే భాగ్యం కల్పిస్తే, గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని వివరించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యలు పరిష్కరిస్తానని, పెద్దల సహకారంతో గ్రామానికి అత్యధిక నిధులు తీసుకువచ్చి అభివృద్ధికి బాటలు వేస్తానని, గ్రామంలోని పేదలకు ప్రభుత్వ పథకాలు అందే విధంగా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. తమ కుటుంబం ఎన్నోఏళ్లగా ప్రజాజీవితంలో ఉందని, ఇప్పటికే గ్రామాభివృద్ధికి కృషి చేయడం జరిగిందని గుర్తుచేశారు. గ్రామస్తుల సహకారంతోనే పిల్లిగుండ్లను ఆదర్శవంతంగా తీర్చుదిద్దుతానని, నిస్వార్థ సేవలందిస్తూ పిల్లిగుండ్లను అభివృద్ధిలో పరుగురు పెట్టిస్తానని తెలిపారు.

రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్ విజేతల ప్రకటన

హైదరాబాద్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా చెవెళ్లలోని తెలంగాణ మోడల్ పాఠశాలలో రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ 'ఇగ్నైట్ విజేతలను పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. ఇందులో రాష్ట్రంలోని 194 మోడల్ పాఠశాలల నుంచి 380 మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ ప్రదర్శించినట్లు విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్ తెలిపారు. విజేతల వివరాలను బుధవారం ప్రకటించారు. సంగారెడ్డి జిల్లా మోడల్‌స్కూల్ విద్యార్థి ఆర్.శివచరణ్ ప్రథమ బహుమతి, ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ పాఠశాల విద్యార్థి సిద్ధూ, రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మోడల్ స్కూల్ విద్యార్థి ఎస్.విఘ్నేశ్వర్ తృతీయ బహుమతి సాధించారు. విజేతలకు నగదు పురస్కారాలు అందించారు.

'అభ్యర్థులు' నిబంధనలు పాటించాలి

కందుకూరు/మహేశ్వరం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) కందుకూరు, మహేశ్వరం మండలాల్లో 17న నిర్వహించే ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలని ఆయా మండలాల ఎన్నికల ప్రత్యేకాధికారులు చెన్నారెడ్డి, సురేష్‌కుమార్ చెప్పారు. బుధవారం రెండు మండలాల్లో అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

అవినీతి పెరిగితే.. అభివృద్ధి క్షీణత

● మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సమాజంలో అవినీతి పెరిగితే, అభివృద్ధి క్షీణిస్తుందని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. అవినీతి నిరోధక దినంగా పాటించే డిసెంబరు 9న కూడా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఇద్దరు అధికారులు ఏసీబీకి పట్టుబడటం అవినీతి క్యాన్సర్‌లా అడుగడుగునా విస్తరించినట్టు స్పష్టమవుతున్నదని ఆయన అన్నారు. ఎన్నికల్లో డబ్బులిస్తే కాదు, సేవ చేస్తేనే ఓట్లు వస్తాయన్న ఆలోచనను కల్గించాలని ఆయన ప్రజలను కోరారు. ఐదేళ్లు పాలించే నేతను ఎన్నుకోవడానికి డబ్బు, మద్యం, కానుకలను ఆశపడి ఓటును అమ్ముకోవద్దని ఈ సందర్భంగా ఓటర్లను బక్కని నర్సింహులు కోరారు.

ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి అనుచరులపై దాడి

● కర్రలతో సొంత పార్టీ నాయకుల అటాక్

కేశంపేట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి అనుచరులపై సొంత పార్టీ నాయకులు దాడి చేశారు. షాద్‌నగర్ నుంచి కేశంపేటకు బుధవారం రాత్రి వెళ్తుండగా మార్గమధ్యలో ఎక్లాస్‌ఖాన్‌పేటలో స్వతంత్ర సర్పంచ్ అభ్యర్థి ప్రవీణ్ యాదవ్‌ను కలవడానికి ఆగారు. దాంతో బీఆర్ఎస్ నాయకులు నవీన్‌రెడ్డి అనుచరుల కారును అడ్డగించి కర్రలతో దాడి చేశారు. అందులో ఉన్న ముగ్గురిని కిందికి దించి గాయపరిచారు. అందులో ఓ వ్యక్తి పారిపోయాడని సమాచారం. తెలుసుకున్న సీఐ నరహరి ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వారిని కేశంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణ విచారణ చేపట్టారు. దాడికి గల కారణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి తెలుసుకున్నారు.

సొంతగూటికి మాజీ వైస్ ఎంపీపీ

● సీపీఎంలో చేరిన ఆవుల మల్లేశ్

మంచాల, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండల పరిధి జాపాలకు చెందిన మాజీ వైస్ ఎంపీపీ ఆవుల మల్లేశ్ తిరిగి సొంతగూటికి చేరుకున్నారు. ఇటీవల వరకు కాంగ్రెస్‌లో ఉన్న ఆయనతో పాటు అనుచరులు పలువురు సీపీఎంలో చేరారు. ఈమేరకు సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య బుధవారం మంచాలలోని కామ్రేడ్ కృష్ణమూర్తి భవన్‌లో పార్టీ కండువా కప్పి వారిని స్వాగతించారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ ఆవుల మల్లేశ్ గతంలో సీపీఎం పక్షాన అనేక ప్రజాఉద్యమాలు, పోరాటాల్లో పాల్గొని కీలక భూమిక పోషించారని కొనియాడారు. సీపీఎం మండల కార్యదర్శి రావుల జంగయ్య, సీనియర్ నాయకులు చీమల ముసిలయ్య, మండల కమిటీ సభ్యులు లెనిన్, కుకుడాల పాపిరెడ్డి, ఓరుగంటి భాస్కర్‌గౌడ్, రజాక్‌పాష, భిక్షపతి, వై.నర్సింహ, ఎస్.కృష్ణ, తదితరులు ఉన్నారు.

మహారాజ్‌పేట్‌ను అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తా

● మహారాజ్‌పేట్ సర్పంచ్ అభ్యర్థి బద్రి శ్రావ్య శ్రీకాంత్



ప్రచారంలో మహారాజ్‌పేట్ సర్పంచ్ అభ్యర్థి బద్రి శ్రావ్య శ్రీకాంత్

శంకర్‌పల్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌గా తనను గెలిపిస్తే గ్రామాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తానని మహారాజ్‌పేట్ సర్పంచ్ అభ్యర్థి బద్రి శ్రావ్య శ్రీకాంత్ తెలిపారు. బుధవారం ఆమె గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఉంగరం గుర్తుకు ఓటేసి తనను సర్పంచ్‌గా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని గ్రామస్తులను వేడుకున్నారు. తనకు ఒక్కసారి సేవచేసే భాగ్యం కల్పిస్తే గ్రామాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తానని హామీ ఇచ్చారు. నిస్వార్థంగా సేవలందిస్తూ, గ్రామ అభివృద్ధికి పాటుపడతానని వివరించారు. ఒక్క అవకాశం ఇస్తే ఆదర్శవంత గ్రామపంచాయతీగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరే విధంగా ప్రయత్నిస్తానన్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచి ఆదర్శవంతంగా ఉంచేందుకు శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తానని, ప్రజల మేలుకోసం నిరంతరం సేవకురాలిగా పనిచేస్తానని వివరించారు. సీసీరోడ్లు, అంతర్గత మురుగుకాలువలు, వీధి దీపాలు, తాగునీటి సౌకర్యం కల్పించి సమస్యలను లేని గ్రామంగా ఉండేందుకు కృషి చేస్తానన్నారు. ఉంగరం గుర్తుకు ఓటేసి సర్పంచ్‌గా అవకాశం కల్పించాలని గ్రామస్తులను వేడుకున్నారు.

ఎమ్మెల్యే సహకారంతో కడ్తాలను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

● కడ్తాల కాంగ్రెస్ మద్దతు సర్పంచ్ అభ్యర్థి రాయికంటి భిక్షపతి ● జోరుగా ప్రచారం



ఓట్లు అభ్యర్థిస్తున్న రాయికంటి భిక్షపతి

కడ్తాల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఒక్కసారి ఆదరించి సర్పంచ్‌గా గెలిపిస్తే కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో కడ్తాలను అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతానని కాంగ్రెస్ మద్దతు కడ్తాల సర్పంచ్ అభ్యర్థి రాయికంటి భిక్షపతి అన్నారు. అన్ని వార్డుల్లో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించి ఇబ్బందులు లేకుండా చూస్తానన్నారు. కడ్తాల కాంగ్రెస్ మద్దతు సర్పంచ్ అభ్యర్థి రాయికంటి భిక్షపతి బుధవారం పలు వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కత్తెర గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో తనను గెలిపించాలని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్లు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, రేవంత్ మిత్రమండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆసిఫ్ అలీ, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, మాజీ ఎంపీటీసీ గురిగళ్ల లక్ష్మయ్య, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మాలె మల్లేశ్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి ఓట్లు అభ్యర్థించారు. కుల, మహిళ, యువజన సంఘాలను కలిసి ఒక్కసారి తనకు అవకాశం ఇస్తే ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవచేస్తానని అన్నారు. కాంగ్రెస్‌తోనే పేదలకు మేలు జరుగుతుందని గ్రామాల అభివృద్ధి సాధ్యమని భిక్షపతి పేర్కొన్నారు. రెండేళ్లలో కడ్తాల ఎంతో ప్రగతి సాధించిందని, అర్హులైన నిరుపేదలకు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ప్రభుత్వ పథకాలు అందించిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. కడ్తాల అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేస్తానని భిక్షపతి హామీ ఇచ్చారు. స్థానికుడినైన తనకు ఇక్కడి సమస్యలు, ప్రజల ఇబ్బందులు తెలుసునన్నారు. సర్పంచ్‌గా అవకాశం ఇస్తే వాటి పరిష్కారానికి ప్రభుత్వం ద్వారా ఎమ్మెల్యే సహకారంతో నిధులు రాబడుతానని ఆయన అన్నారు. అన్నివార్డుల్లో సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాల్వలు, వీధి దీపాలు, పూర్తిస్థాయిలో తాగునీటి సౌకర్య కల్పన చేపడుతామని భిక్షపతి పేర్కొన్నారు. నాయకులు యాదగిరిరెడ్డి, జహంగీర్‌బాబా, జహంగీర్ అలీ, కృష్ణ, రాంచందర్‌నాయక్, సత్యం యాదవ్, రాజేందర్ గౌడ్, రాజేశ్, నరేశ్‌నాయక్, శ్రీకాంత్, బుచ్చయ్య, యాదయ్యగౌడ్, బోసు రవి, మంకి శ్రీను, చందోజీ, మల్లయ్య, యాదయ్య, వెంకటేశ్, రాయికంటి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



గూడూరు శ్రీనివాస్‌రెడ్డి తో కలిసి ఎన్నికల ప్రచారంలో రాయికంటి భిక్షపతి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

శంషాబాద్ రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన శంషాబాద్ మండలంలో జరిగింది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు వనపర్తి జిల్లా అలంపల్లికి చెందిన బుడగాని యుగేందర్(27), మొహ్మద్ ముజీబ్‌లు బుధవారం బైక్‌పై అదే గ్రామానికి చెందిన తోక రాఘవేందర్‌ను శంషాబాద్‌లోని ఆర్జీఐఏ విమానాశ్రయంలో వదిలిపెట్టేందుకు బయలుదేరారు. రాఘవేందర్‌ను విమానాశ్రయంలో వదిలిపెట్టిన తర్వాత ముజీబ్, యుగేందర్‌లు స్వగ్రామం అలంపల్లి వైపు వెళ్తుండగా మార్గ మధ్యలో శంషాబాద్ మండలం తొండుపల్లి రైల్వే బ్రిడ్జి వద్ద వెనక నుంచి వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ముజీబ్‌కు తీవ్ర గాయాలు కాగా.. యుగేందర్ అక్కడికక్కడే మృతిచెందాడు.

మద్యం లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తా

మొయినాబాద్ రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మద్యం లోడ్‌తో వెళ్తున్న లారీ బోల్తాపడిన ఘటన చిలుకూరు పరిధిలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ మండలం రషీద్‌గూడలోని రంగారెడ్డి జిల్లా రెండో గోదాములో నుంచి శంకర్‌పల్లి మండలం ఎన్కేపల్లి చౌరస్తాలోని పద్మావతి వైన్స్‌కు డీసీఎం వాహనంలో దాదాపు రూ. 30 లక్షల మద్యంను తీసుకువస్తుండగా మార్గమధ్యలో చిలుకూరు సమీపంలోని కట్టమిదకు రాగానే డీసీఎం టైరు పగిలింది. దీంతో డీసీఎం అదుపు తప్పి రోడ్డుపై బోల్తా పడింది. అందులోని మద్యం రోడ్డుపై పడింది. డ్రైవర్‌తో పాటు క్లీనర్‌కు ఎలాంటి గాయాలు కాలేవు. వెంటనే అక్కడికి వచ్చిన నిర్వహకులు వేరే వాహనంలో మద్యాన్ని తరలించారు.

సైకిల్‌ట్రాక్‌పై తలనీలాలు తీసుకున్న వ్యక్తులపై కేసు

శంకర్‌పల్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): రింగురోడ్డు పక్కన గల సైకిల్‌ట్రాక్‌పై తలనీలాలు తీసుకున్న వ్యక్తులపై మోకిల పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. మీర్జాగూడకు చెందిన కోట వెంకటయ్యగౌడ్ ఇటీవల మృతిచెందాడు. మీర్జాగూడ అనుబంధ గ్రామమైన ఇంద్రారెడ్డినగర్‌లోని రింగురోడ్డు సమీపంలో గల శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. బుధవారం దశదిన కర్మ ఉండటంతో మృతుడి కుటుంబ సభ్యులు సమీపంలోని సైకిల్ ట్రాక్‌పై తలనీలాలు తీసుకున్నారు. సైక్లింగ్ చేసేవారు ట్రాక్ నిర్వాహకులకు సమాచారమిచ్చారు. సంబంధిత వీడియోను సామాజిక మాధ్యమంలో పోస్టు చేశారు. దాంతో పోలీసులు అక్కడికి చేరుకుని వారిని అక్కడి నుంచి ఇంటికి పంపించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కడ్తాల అభివృద్ధికి నిధులు తీసుకొస్తా

● ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ మద్దతు కడ్తాల సర్పంచ్ అభ్యర్థి బావండ్లపల్లి ఆనంద్



కాటమయ్య దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న గంప వెంకటేశ్, జీఎల్ఎన్ రెడ్డి, ఆనంద్



కడ్తాల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యావంతుడినైన తనకు ప్రజా సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉందని, కడ్తాల సర్పంచ్‌గా ఆదరించి గెలిపిస్తే ఆయా సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధికి ప్రభుత్వంతో కొట్లాడి నిధులు తీసుకువస్తానని బీఆర్ఎస్ మద్దతు సర్పంచ్ అభ్యర్థి బావండ్లపల్లి ఆనంద్ అన్నారు. పదవులు ఉన్నా లేకపోయిన దశాబ్దాలుగా తమ కుటుంబం ప్రజాసేవలో ముందుకు సాగుతోందని, సాయం కోరి వచ్చిన పేదలకు చేయూతనందించామన్నారు. కరోనా కష్ట కాలంలో పేదలకు, ప్రమాదాలు జరిగిన బాధితులకు, మృతుల కుటుంబాలకు తనవంతు సహాయ సహకారాలు అందించానని తెలిపారు. కడ్తాల బీఆర్ఎస్ మద్దతు సర్పంచ్ అభ్యర్థి బావండ్లపల్లి ఆనంద్ బుధవారం వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మనర్సింహారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు కడారి రామకృష్ణ, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గంప శ్రీను, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ లాయక్‌అలీ, బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఉంగరం గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆనంద్ ఓటర్లను అభ్యర్థించారు. స్థానిక కాటమయ్య దేవాలయంలో గౌడ సంఘం నాయకులతో కలిసి పూజలు నిర్వహించారు. గౌడ కులస్థులంతా తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. చిరు వ్యాపారులు, కులవృత్తుల వారిని, కార్మికులను, మహిళలను, రైతులను, యువజన సంఘాల సభ్యులను కలిసి సర్పంచ్ గా ఆదరించి గెలిపిస్తే ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని తెలిపారు. కాంగ్రెస్ మోసపూరిత మాటలు నమ్మి మరోమారు నష్టపోవద్దని ఓటర్లకు సూచించారు. బీఆర్ఎస్‌తోనే పేదలకు మేలుజరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేశ్, అంజి, వెంకటేశ్, సుదాకర్ గౌడ్, శంకరయ్య, కేశవులు, శ్రీను, శ్రీరాములు,జంగయ్య, రాములు, సత్యనారాయణ, కొండల్, శివ, శ్రీకాంత్, భగీరథ, రామచంద్రయ్య, దాను, గణేశ్, మంగళపల్లి నర్సింహ్మా, తదితరులు పాల్గొన్నారు.